

# ఏడుపెరగనివాడు

అది రుద్రభూమి!

పుట్టిన ప్రతివాడూ ఆఖరికి చేరుకునే పుణ్యభూమి. జీవితమనే అవిశ్రాంత యానంలో ఆఖరి ద్వారం అది. ఆ ద్వారం దగ్గర నుంచుని ఉన్నాడు కాటికాపరి ఏసోబు.

చీకటంత నల్లగా ఉన్నాడు యేసోబు. కాగడాల్లా ఎర్రటి కళ్ళు, గుబురు మీసం, భేతాళుడి చేతులు. సుబ్బయ్యగారు బుగ్గయి పోతుంటే కొడుకులూ మనవలూ గోలు గోలున ఏడుస్తున్నారు. గుండెలవిసిపోయేట్టు రాళ్ళు కరిగిపోయేట్టు 'అనాధులమై పోయినాం! ఎవరు దిక్కు మాకు' అని ఆకాశానికంటేటట్లు విలపిస్తున్నారు. ఆ ఏడుపులు, ఆవేదన,ఆ బాధ ఏమీ ఏసోబు కంట లేదు. అతని ముఖంలో ఏ విచారమూ లేదు. అవన్నీ తనకు పట్టనట్లు తన ధర్మం తను చేసుకుపోతున్నాడు.

ఇప్పటి మాటా! తనకి పదేళ్ళ వయస్సు వచ్చినప్పటినించి తండ్రి ప్రక్కన వుండేవాడు. నిత్యమూ చావులూ, ఏడుపులూ తప్ప వేరేమీ ఎరగడు. అంచేత జీవితంలోని దుఃఖాలన్నింటి కంటె పెద్ద దుఃఖమైన మృత్యువు అతన్నేం కదిలించదు. సజ్జనులు పోయినప్పుడు లోలోపల "అయ్యో!" అనుకునేవాడు. దుర్జనులు పోయినప్పుడు "ఇప్పటికి పాపం పండింది" అనుకునేవాడు. తను

దొంగ ఏడుపులు చూశాడు. కుంకుమ చెరిగి పోతుంటే, గాజులు చిట్లిపోతుంటే, గుండె ముక్కలవుతుంటే "కాలసహజం"అనుకునేవాడు తప్ప -కంట నీరెట్టి ఎరగడు.

తండ్రిని మట్టి చేస్తుంటే అతనికేం అన్పించలేదు. అంతదాకా ఎందుకు? కట్టుకున్న ఇల్లాల్ని మోసుకొచ్చినప్పుడు కూడా కదిలిపోలేదు. జనమంతా "బండ ముండాకొడుకు" "రాతిగుండె" "రాక్షసుడు"అన్నారు.

బతికున్నప్పుడు మిగతా జనం అడుగుపెట్టడానికే భయపడేచోట, ఆ పేరు తలుచుకుంటేనే హడలిపోయేచోట, ఏసోబు నిత్యనివాసంగా ప్రతిక్షణం మృత్యువాతావరణంలో నిర్మోహంతో నిరాసక్తతతో జీవిస్తున్నాడు. జనమంతా వెళ్ళిపోతున్నారు.

"అయ్యోవ్!" పన్నెండేళ్ళ పిల్లాడు కృష్ణవొడ్డునించి కేక. అతగాడు ఏసోబు కొడుకు బుల్లిగాడు. వాడికి ఈపక్కలకి రావటానికి భయం.

"ఆ! వచ్చె" యేసోబు తిరిగి కేక.

ఏసోబు గుడిసె కృష్ణ వొడ్డునే. కొడుకు గంజి కాచి తండ్రిని పిలిచాడు. ఇద్దరూ కృష్ణవొడ్డున కూర్చుని ముంతల్లో గంజి వొంపుకు తాగుతున్నారు. బుల్లిగాడు తాగలేక పోతున్నాడు. "ఏటయిందిరా?" అని తండ్రి కొడుకుని దగ్గరకు తీసుకుంటే బుల్లిగాడి వొళ్ళు కాలిపోతోంది.

"ఓరి జొరం వచ్చిందిరా ....." అంటూ ఏసోబు మిగిలిన గంజి వొదిలేసి కొడుకు నెత్తుకుని గుడిసెలోకి తీసుకెళ్ళి పడుకోబెట్టి కంబళి కప్పి "మందు తెస్తానుండు" అంటూ వూళ్ళోకొచ్చాడు.

ఏసోబు వీధిలో నడుస్తుంటే జనమంతా పక్కకు తప్పుకు వెళ్ళిపోతున్నారు. ఆచార్లుగారి దగ్గరకెళ్ళి మందు తీసుకొని చిల్లరకొట్టు దగ్గరకొచ్చి ఉప్పు, చింతపండు తీసుకున్నాడు ఏసోబు. షావుకారు పొట్లాలు దూరంగా విసిరేసి డబ్బులమీద నీళ్ళు చల్లి గల్లాపెట్టెలో వేసుకొన్నాడు. వీధిలో నడుస్తూ ఏసోబు అనుకున్నాడు. 'వాళ్ళంతా మనుషులు. నేను కాను. నన్నుచూసినా తాకినా

సెరుపే! కాని అయ్యలూ! మీరందరూ నాచేతిమీంచి పోవల్సినోళ్ళే......'

గుడిసెకొచ్చి కొడుక్కి మందిచ్చి, ఓ గంట వొళ్ళు వాల్చాడో లేదో గట్టు మీంచి పిలుపు. మృత్యువుకి పగలూ రాత్రీ లెక్కేవిటి! తనకూ వేళాపాళా లేదు! లేచి వెళ్ళాడు ఏసోబు.

తిరిగి వచ్చేటప్పటికి బాగా పొద్దుపోయింది. ఆ రోజు చీకటి మరీ చిక్కగా వుంది. కొడుకు వొళ్ళు మసిలిపోతోంది. మళ్ళీ మందిచ్చాడు. బుల్లిగాడి తల వొళ్ళో పెట్టుకు కూర్చున్నాడు. వాడి వొంటిమీద స్పృహ లేదు. ఉన్నట్టుండి బుల్లిగాడి వొళ్ళు చల్లబడుతోంది. మరీ చల్లబడుతోంది. ఏసోబు అరికాళ్ళు రుద్దాడు. అరిచేతులు రుద్దాడు. వాణ్ణి ఎట్లాగైనా బతికించుకోవాలి. లాభం లేదు. చిన్నవాడి వొళ్ళు సాంతం చల్లబడిపోయింది. ఏసోబు బుల్లిగాణ్ణి గుండెలకి హత్తుకున్నాడు. భళ్ళు భళ్ళున ఏడ్చాడు. జీవితంలో మొట్టమొదటిసారి ఏడ్చాడు. నరాలు తెగిపోయేట్టు ఏడ్చాడు. కృష్ణ కదిలిపోయేటట్లు, నేలపగిలిపోయేటట్టు, ఆకాశం చిరిగిపోయేటట్టు ఏడ్చాడు.

ఏడ్చిఏడ్చి ఆగి ఒక్కసారి కృష్ణవైపు చూశాడు. ఎప్పటిలాగా ముందుకెళ్తోంది.

అవునూ! తను ఎందుకు ఏడ్చినట్లు?

మామూలయిపోయాడు "వెళ్ళిన వాళ్ళు వెళ్తారు ఉన్నవాళ్ళు ఉంటారు అనుకుని ఏమీ జరగనట్టు కొడుకుని బుజాన వేసుకొని మట్టిచేయడానికి గట్టుమీది కొచ్చాడు. కొడుకుమీద మట్టి కప్పి ఎదురుగా నుంచుని అన్నాడు. "ఓ తల్లీ! నేల తల్లీ! నువ్వెంత గొప్పదానివమ్మా? ఏడుపెరగని వాణ్ణి. ఈ బుడ్డాడికోసం ఏడుస్తానేమోనని ఆణ్ణి ముందే తీసుకెళ్ళావా అమ్మా! లేకపోతే ఓరి బుడ్డాడా! నీ అయ్యపోతే నువ్వేడుస్తావేమోరా! బతుకంతా ఏడుపెరక్కుండా బతికిన ఏసోబుగాడు పోయాక ఎనక ఎవరూ ఏడవకూడదని ఆణ్ణిప్పుడే లాక్కెళ్లావా తల్లీ! కానమ్మా! నాకేం దిగుల్లేదు! కాన్తల్లీ! నే పోయాక మట్టిచేసేందుకు మడిసి లేకుండా పోయాడు. కొంచెం ఆ సమయ మొచ్చినప్పుడు ..... కొంచెం ముందు చెప్తివా ..... నేనే గొయ్యి తీసుకు అందులో పడుంటాను. ఆపైన నువ్వే మట్టి కప్పుకో తల్లీ" అంటూ ఆకాశంవైపు చూసి పిచ్చిగా నవ్వాడు. ❊